శంకుస్థాపనకు ఏడు నెలలు

- బైపాస్ రోడ్డు నిర్మాణంలో కానరాని పురోగతి
- 20 కిలోమీటర్ల రోడ్డుకు రూ.10కోట్లు మంజూరు





పాండురంగాపురం వద్ద బైపాస్ రోడ్డు నిర్మించే మార్గమిదే (ఇన్‌సెట్) శిలాఫలకం

మంత్రి శంకుస్థాపన చేసిన శిలాఫలకం

పాల్వంచరూరల్: మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రానికి అనుసంధానంగా ఏడాది క్రితం మంజూరైన బైపాస్ రహదారి నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. ఏపీ స్టీల్, సీతారాంపట్నం మీదుగా అల్లూరు సెంటర్ సూరారం, పాండురంగాపురం వరకు 20 కిలోమీటర్ల బైపాస్ రహదారి నిర్మాణం కోసం షెడ్యూల్డ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ (ఎస్‌టీడీఎఫ్) కింద 2024లో రూ.10 కోట్లు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణం కోసం ఆర్‌అండ్‌బీ శాఖ పర్యవేక్షణలో టెండర్లు కూడా పూర్తిచేశారు. నిర్మాణ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్, సంబంధిత అధికారులు ఈ ఏడాది జనవరి 3న రహదారి నిర్మాణ పనుల ప్రారంభానికి పాండురంగాపురం గ్రామం వద్ద రాష్ట్ర మంత్రులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎంపీ రాఘురాంరెడ్డి శంకుస్థాపన చేశారు. ఇది జరిగి ఏడు నెలలు దాటినా నేటికీ రహదారి నిర్మాణ పనులను ప్రారంభించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు.

తీరనున్న ట్రాఫిక్ ఇబ్బందులు..

ఏపీ స్టీల్, సీతారాంపట్నం, కేటీపీఎస్ కర్మాగారం మీదుగా సూరారం, పాండురంగాపురం గ్రామాల నుంచి బూర్గంపాహడ్ మండలం పట్టీనగర్ క్రాస్‌రోడ్డు వరకు విస్తరణ జరిగితే భద్రాచలం వైపు వెళ్లే మార్గంలో తీవ్రం ట్రాఫిక్ ఇబ్బందులు తీరనున్నాయి. అంతేకాకుండా భద్రాచలం వైపు వెళ్లే వాహనాలు తక్కువ సమయంలో పినపాక పట్టీనగర్ క్రాస్‌రోడ్డు వరకు చేరుకునే అవకాశం ఉంది.

జాప్యం ఎందుకో?

బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్మాణ పనులు ప్రారంభించడంలో జాప్యం చేయడం వెనుక పలు కారణాలు వినిపిస్తున్నాయి. రెండు వరసల రహదారి విస్తరణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మెటల్, మట్టి సమస్యగా మారిందని రోడ్డు పనుల్లో జాప్యం చేస్తున్నట్లు సమాచారం. బీసీఎం జాతీయ రహదారిపైన రంగాపురం వద్ద కిన్నెరసాని వాగుపైనగల బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో గత వర్షాకాలంలో కిన్నెరసాని వాగు పొంగి ప్రవహించడంతో బ్రిడ్జి వద్ద రోడ్డు కోతకు గురైంది. దీంతో కొత్తగూడెం నుంచి భద్రాచలం వైపు వెళ్లే వాహనాలను నిలిపివేసి వయా పాండురంగాపురం, పట్టీనగర్ మీదుగా మళ్లించారు. ఈ బైపాస్ రహదారి నిర్మాణం పూర్తయితే ఈ మార్గంలో భద్రాచలం వైపు ఈజీగా ప్రయాణం చేసే అవకాశాలు ఉన్నాయి.

వెంటనే ప్రారంభించాలి..



ఏపీ స్టీల్, సీతారాంపట్నం, పాండురంగాపురం మీదుగా మంజూరైన బైపాస్ రహదారి పనులు జాప్యం చేస్తుండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. కాంట్రాక్టర్ వెంటనే రహదారి నిర్మాణ పనులు ప్రారంభించాలి.

– శ్రీకాంత్, పాండురంగాపురం

జాప్యం గర్హనీయం..



బైపాస్ రహదారి నిర్మాణం కోసం మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేసి ఏడునెలలు గడిచినా నేటికీ పనులు ప్రారంభించకుండా జాప్యం చేయడం తగదు. యుద్ధ ప్రాతిదికన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలి.

– పూసల విశ్వనాథం, పాండురంగాపురం

కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం..



బైపాస్ రహదారి నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు జాప్యం చేయకుండా వెంటనే పనులు ప్రారంభించాలని నోటీసులు జారీ చేశాం. పనులు ప్రారంభమైన 18 నెలల కాలంలో నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది.

– వంశీ, ఆర్‌అండ్‌బీ ఏఈ

రైతులకు అన్యాయం చేస్తే సహించం..



నిర్వాసిత ప్రాంత మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: రైతులకు అన్యాయం చేస్తే సహించబోమని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని 21పిట్ ఏరియాకు చెందిన రైతులు, సింగరేణి అధికారుల మధ్య వివాదాస్పదంగా ఉన్న భూమిని ఆర్డీఓ మధు, తహసీల్దార్ రవికుమార్, జీఎం కృష్ణయ్యలతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు. తాము దశాబ్దాలుగా ఇదే భూమిలో సాగు చేసుకుంటున్నామని, గతంలో 588 పరిధిలో ఉన్న ఏడు ఎకరాల విషయంలో నోటీసులు జారీ చేసిన రెవెన్యూ అధికారులు ప్రస్తుతం మా భూములను కూడా స్వాధీనం చేసుకుంటామని అంటున్నారని రైతులు వాపోయారు. తమకు పట్టాదారు పాస్‌పుస్తకాలు కూడా ఉన్నాయంటూ ఎమ్మెల్యేకు చూపించారు. సదరు పుస్తకాలను పరిశీలించిన ఆర్డీఓ ఇందులో ఏడు ఎకరాలు కోర్టు పరిధిలో ఉందని, మిగతా 13 ఎకరాల సర్వే నంబర్ ఇక్కడిది కాదని చెప్పారు. అలా అయితే రైతుల భూమి ఎక్కడుందో మీరే చూపించాలని, అప్పటి వరకు ఈ ప్రాంతంలో ఓసీ ఏర్పాటు పనులు ప్రారంభించొద్దని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా విజయలక్ష్మీనగర్, తిలక్‌నగర్ గ్రామపంచాయతీల పరిధిలో సర్వే చేసిన ఇళ్లకు పరిహారం చెల్లించమని చెప్పడం అన్యాయమని నిర్వాసితులు ఆర్డీఓ ఎదుట నిర్వాసితులు నిరసన వ్యక్తం చేశారు. 21పిట్ ఏరియా ప్రతినిధులు పూనెం సురేందర్, మడుగు సాంబమూర్తి, ఎట్టి హరికృష్ణ, లాలు, సత్యనారాయణ, వడ్ల శ్రీను పాల్గొన్నారు.

హామీలు అమలు చేస్తున్నాం..

ఇల్లెందు: కాంగ్రెస్ ఎన్నికల్లో అధికారంలోకి వస్తే పలు హామీలు అమలు చేస్తామని ప్రకటించామని, ప్రజలు నమ్మకంతో ఓటేసి సంపూర్ణ మెజార్టీ ఇచ్చి పాలించే అవకాశం ఇచ్చారని, ఇచ్చిన హామీలు ఒక్కోటి అమలు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఇల్లెందులో 59 మందికి రూ.19 లక్షలు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బానోతు రాంబాబు, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, రాము, డానియేల్ పాల్గొన్నారు.

చెట్లకు మేకులు కొట్టొద్దు.. తీగలు కట్టొద్దు..



పడమటనర్సాపురంలో చెట్లకు ఉన్న బోర్డులు తొలగిస్తున్న సిబ్బంది

జూలూరుపాడు: చెట్లకు మేకులు కొట్టడం, తీగలు కట్టడం వల్ల వాటి పెరుగుదలకు ఆటంకం ఏర్పడుతుందని జూలూరుపాడు ఎంపీడీఓ తాళ్లూరి రవి అన్నారు. కలెక్టర్ ఆదేశాలతో సర్వీస్ టూ వనదేవత పేరిట అధికార యంత్రాంగం వృక్షాలను కాపాడే ప్రయత్నం చేస్తోందన్నారు. మంగళవారం జూలూరుపాడు అధికార యంత్రాంగం వినోభానగర్, వెంగన్నపాలెం, సాయిరాంతండా, పడమటనర్సాపురం, మాచినేనిపేటతండా, కొమ్ముగూడెం గ్రామాల్లో ప్రధాన రహదారికి పక్కనున్న చెట్లకు ఉన్న బోర్డులు, మేకులు, తీగలను తొలగించారు. పలు గ్రామాల్లో ఎంపీడీఓ రవి పర్యటించి, సర్వీస్ టూ వనదేవత కార్యక్రమాన్ని పరిశీలించారు. మాట్లాడుతూ.. చెట్లకు మేకులు కొట్టడం, తీగలు కట్టడం వల్ల ఎదుగుదల లేక గాలి దుమారానికి విరిగిపడే ప్రమాదం ఉందని, అదేవిధంగా చెట్లు ఎండిపోతాయన్నారు. చెట్లను రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు జి.లక్ష్మణ్, చరిత్‌రాజ్, హారిక, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

దాతలు విద్యార్థులకు సహకరించాలి



యూనిఫాం అందజేస్తున్న సురేశ్‌రెడ్డి

పాల్వంచరూరల్: దాతలు పేద విద్యార్థులపై దృష్టి సారిస్తే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఇంటర్ జిల్లా విద్యాధికారి హెచ్.వెంకటేశ్వరరావు అన్నారు. బస్వతారక కాలనీ పంచాయతీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం శ్యామల గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండర్, చైర్మన్ నల్లా సురేశ్‌రెడ్డి యూనిఫాం అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఇంటర్ జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ... శ్యామల గోపాలన్ ఎడ్యుకేషనల్ చైర్మన్ గతంలో కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం తాత్కాలిక షెడ్లు నిర్మాణం చేయడమే కాకుండా పేదవిద్యార్థులకు యూనిఫాం అందజేయడం స్ఫూర్తిదాయకం అన్నారు. దాతల సహకారాన్ని తీసుకుని విద్యార్థులు కష్టపడి చదువుకుని కళాశాలకు, జిల్లాకు పేరు తేవాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ శంకర్ మాట్లాడుతూ... సురేశ్‌రెడ్డి సేవా దృక్పథం కళాశాలకు కల్పతరువు అన్నారు. సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రిన్సిపాల్ కోరిక మేరకు కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి తనవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా సురేశ్‌రెడ్డిని శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

సమస్యలు పరిష్కరించండి..



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సుజాతనగర్: సుజాతనగర్‌లోని నాలుగు డివిజన్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ సుజాతకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి వీర్ల రమేష్ మాట్లాడుతూ గ్రామాల్లో పలుచోట్ల వీధి లైట్లు వెలగడం లేదని, పారిశుద్ధ్య అస్తవ్యస్తంగా ఉండటంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, డ్రెయినేజీలు చెత్తతో నిండుకున్నాయని తెలిపారు. మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ వెలగకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బచ్చలకూర శ్రీను, కొండె కృష్ణ, గండమాల భాస్కర్, నల్లగోపు పుల్లయ్య, ఉడుగుల శ్రీకాంత్, బాబా, చింతలపూడి కృష్ణ, గంగయ్య పాల్గొన్నారు.

గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నిక



నాగేశ్వరరావు

టేకులపల్లి: సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం సెంట్రల్ కమిటీ ఎన్నికలు ఆదివారం గోదావరిఖని భవానీ గార్డెన్స్‌లో 11 ఏరియాల ప్రతినిధుల సమక్షంలో జరిగాయి. నూతన సెంట్రల్ కమిటీని ఎన్నుకున్నారు. టేకులపల్లి మండలం కోయగూడెం ఓపెన్‌కాస్టు ఉద్యోగి సెంట్రల్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా భూక్యా నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం వివరాలు వెల్లడించారు. అధ్యక్షుడిగా ధరావత్ పంతులు, వైస్ ప్రెసిడెంట్‌గా అంగోత్ భాస్కర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుగులోత్ దశరథ్, కొత్తగూడెం రీజినల్ వైస్ ప్రెసిడెంట్‌గా రామ్ సింగ్, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా భూక్యా వెంకట్రావు, భూక్యా కృష్ణ, ట్రెజరర్‌గా మాలోత్ రాంబాబు, బెల్లంపల్లి రీజియన్ వైస్ ప్రెసిడెంట్‌గా బి.వీరన్న, రామగుండం రీజన్ జాయింట్ సెక్రటరీగా వెంకటయ్య ఎన్నికైనట్లు తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

టేకులపల్లి: వర్షాల కారణంగా వాగులు, వంతెనల వద్ద ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కార్యదర్శులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని టేకులపల్లి ఎంపీడీఓ బైరు మల్లేశ్వరి అన్నారు. మంగళవారం గంగారం, లచ్చగూడెం, కిష్టారం, బర్లగూడెం, చింతోనిచెలక, ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు పంచాయతీలను సందర్శించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఎంపీఓ జేఎల్ గణేష్ గాంధీ, ఏపీఓ కాళంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

తాగునీరు, పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి..



మాట్లాడుతున్న జమలయ్య

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య, పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య అన్నారు. స్థానిక శేషగిరిభవన్‌లో మంగళవారం జరిగిన పట్టణ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శంకుస్థాపనలు పూర్తయిన రోడ్లు, డ్రెయినేజీలు, ప్రభుత్వ భవనాలను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో తేవాలన్నారు. వర్షాలు కురుస్తుండడంతో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని తక్షణమే అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని డిమాండ్ చేశారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈనెల 16న నిర్వహించే కొత్తగూడెం పట్టణ ఏఐకేఎస్ మహాసభను రైతులు విజయవంతం చేయాలని కోరారు. జి.నగేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాచర్ల శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, భూక్యా శ్రీను, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వండి..

కొత్తగూడెంటౌన్: రామవరంలోని టూటౌన్ పోలీసు స్టేషన్‌ను మంగళవారం కొత్తగూడెం ఓఎస్డీ నరేందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సీఐ ప్రతాప్, సిబ్బందితో మాట్లాడారు. గొత్తికోయ గ్రామాలైన మర్రిగూడెం, గడ్డిగుప్ప, జగ్గారాం, పాలెంవాడు గ్రామాలకు కొత్తగా ఎవరైనా వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

ఇల్లెందురూరల్: మామిడిగూడెం గ్రామపంచాయతీలో మంగళవారం రొంపేడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. బీపీ, టీబీ, ఎక్స్‌రే, హెచ్‌సీవీ, హెచ్ఐవీ, సిఫిలిస్, ఆర్‌బీఎస్ తదితర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి

పాల్వంచ: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సాయిబాబా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీఆర్ భవన్‌లో సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీల సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని, వాటిని వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో తులసీరాం, రాయబారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావ్, అన్నారపు వెంకటేశ్వర్లు, శనగారపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి..

టేకులపల్లి: తమ పట్టా భూమిపైనే అక్రమంగా పట్టా కోసం దరఖాస్తు చేసుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. మంగళవారం టేకులపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తరువాత ప్రెస్‌క్లబ్‌లో బాధితులు మూడు వీరన్న, కుమార్, భద్రు, రాజు మాట్లాడుతూ సదరు వ్యక్తికి పట్టా జారీ అయ్యేందుకు ప్రాసెస్ అంతా పూర్తయినట్లు తెలిసిందని వాపోయారు. అధికారులు పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈత, తాటి మొక్కలను సంరక్షించాలి



ఈత మొక్కలు నాటుతున్న అధికారులు

పాల్వంచరూరల్: చెరువు కట్టలపై నాటిన ఈత, తాటి మొక్కలను సంరక్షించుకోవాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి అన్నారు. జగన్నాథపురం, నారాయణరావుపేట ఎస్సీ కాలనీ గ్రామపంచాయతీల పరిధిలోని చెరువు కట్టలపై మంగళవారం ఎంపీడీఓ ఎక్సైజ్‌శాఖ అధికారులతో కలిసి ఈత, తాటి మొక్కలను నాటారు. మాట్లాడుతూ... ఈత, తాటి మొక్కలను సంరక్షణ చేయడం ద్వారా ఉపాధి అవకాశలు లభించడమే కాకుండా చెరువు కట్టల పటిష్టతకు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ సరిత, హెడ్‌కానిస్టేబుల్ భీక్షం, లక్ష్మీనారాయణ, ఎంపీఓ చెన్నకేశవరావు, ఏపీఓ పొరండ్ల రంగా, సహాయకులు పాల్గొన్నారు.

పుసక్త పఠనం మేధాశక్తికి దర్పణం



కొత్తగూడెంఅర్బన్: మాట్లాడుతున్న వీరబాబు

కొత్తగూడెంఅర్బన్: గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ 133వ జయంతిని మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. గ్రంథాలయంలో వర్గీకరణ సిద్ధాంతమును ప్రవేశపెట్టి పుస్తకాల వర్గీకరణ సులువుతరం చేశారని, ఆయన సేవలు మరువలేనివన్నారు. అనంతరం గ్రంథపాలకులను శాలువా కప్పి సన్మానించారు. ఎం.నవీన్‌కుమార్, జి.మణిమృదుల, పాఠకులు పాల్గొన్నారు.

ఇల్లెందు: గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్‌కు గ్రంథపాలకులు, పాఠకులు ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం ఇల్లెందు గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథపాలకురాలు రుక్మిణి, పాఠకులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: పుసక్త పఠనం మేధాశక్తికి దర్పణం వంటిదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. మౌఖిక సాహిత్యం, శృతి సాహిత్యాన్ని గ్రంథ రూపంలో తీసుకురావడం, వాటిని భద్రపర్చడం ద్వారా ఈ గ్రంథాలయ వ్యవస్థ ఆధునిక సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను నిర్వీర్యం చేసే కుట్ర

ఇల్లెందు: అంగన్‌వాడీలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలకు తెరలేపిందని పీఎంశ్రీ పథకాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈసం వెంకటమ్మ, జిలకర పద్మ అన్నారు. మంగళవారం ఇల్లెందు సీపీఎం కార్యాలయంలో ప్రాజెక్టు స్థాయి మహాసభలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చే పీఎంశ్రీ పథకం వల్ల అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులను పాఠశాలలకు తరలిస్తున్నారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని టీచర్లు, ఆయాలతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు మరియా, అబ్దుల్ నబీ, కృష్ణ, ఫాతిమా, దేవేంద్ర, అరుణ, దీప్తి, కుమారి, దయావతి, సుభద్ర, పద్మ, దేవమణి, వనజ, పార్వతి పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



సూపర్‌బజార్(కొత్తగూడెం): నినాదాలు చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

అఖిల భారత విద్యార్థి సమాఖ్య 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ... బ్రిటిష్ పాలకుల చెర నుంచి భరతమాత విముక్తి కోసం విద్యార్థులందరినీ ఒక తాటిపైకి తీసుకొచ్చేందుకు లక్నో నగరంలోని బెనారస్ విశ్వవిద్యాలయంలో 1936 ఆగస్టు 12న అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆవిర్భవించిందన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: మాట్లాడుతున్న హరీశ్‌గౌడ్



టేకులపల్లిలో జెండా ఎగురవేస్తున్న నాయకులు



పాల్వంచరూరల్: జెండా ఆవిష్కరిస్తున్న రాహుల్



జూలూరుపాడు: మాట్లాడుతున్న చాంద్‌పాషా

క్లుప్తంగా

వైఎస్.జగన్‌ను కలిసిన 'గూడెం' వాసి



జగన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న వంశీకృష్ణ

కొత్తగూడెంఅర్బన్: ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని కొత్తగూడెం పట్టణా నికి చెందిన ప్రముఖ వ్యాపారి కోరుకొండ వంశీకృష్ణ కలిశారు. తాడేపల్లిలోని జగన్ నివాసంలో మంగళవారం ఆయన జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

నేడు చలో కలెక్టరేట్

టేకులపల్లి: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి అంగన్‌వాడీ టీచర్లు అధిక సంఖ్యలో తరలిరావాలని అంగన్‌వాడీ టీచర్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాయల ఇందిర, సంధ్యారాణి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

జిల్లా జడ్జిని కలిసిన ట్రాఫిక్ ఎస్ఐ



జడ్జి పాటిల్ వసంత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను మంగళవారం కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గడ్డం ప్రవీణ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రవీణ్‌కుమార్‌కు జడ్జి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

ఉత్పత్తి, ఉత్పాదకతపై అవగాహన ఉండాలి

ఇల్లెందు: సింగరేణిలోని అన్ని డిపార్ట్‌మెంట్లలో పనిచేసే ఉద్యోగులు సంస్థలోని యంత్రాలు, ఉత్పత్తి, ఉత్పాదకత పట్ల అవగాహన ఉండాలని ఏరియా జీఎం వీసం కృష్ణ అన్నారు. మంగళవారం జేకే ఓసీలో అధికారులు, ఉద్యోగులతో ఏర్పాటు చేసిన మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశంలో ఆయన పలుశాఖలు, యంత్రాలు, ఉత్పత్తి, ఉత్పాదకత పట్ల అవగాహన కల్పించారు. ఉద్యోగులు సమష్టిగా లక్ష్యాలను అధిగమించాలని కోరారు.

ఆకతాయిల సమాచారమివ్వండి..

కొత్తగూడెంఅర్బన్: పిల్లలు, మహిళలను ఆకతాయిలు ఇబ్బంది పెడితే షీటీంకు సమాచారం ఇవ్వాలని షీటీం అండ్ ఏహెచ్‌టీయూ సీఐ రాము అన్నారు. మంగళవారం కొత్తగూడెంలోని నర్సింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. బాధితులు షీటీమ్‌ను సంప్రదించాలని లేదంటే 87126 82131 నంబరుకు చెప్పొచ్చని తెలిపారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

కొత్తగూడెంఅర్బన్: సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా సెప్టెంబర్ ఒకటో తేదీన హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని సంఘం జిల్లా అధ్యక్షుడు పూనెం నరసయ్య అధ్యక్షతన నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు.

లాభాల వాటా చెల్లించాలి



మాట్లాడుతున్న మాధవనాయక్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థకు రూ.కోట్లు లాభం వస్తుందంటే అది కాంట్రాక్ట్ కార్మికుల భిక్షేనని, అటువంటి కార్మికులకు లాభాలలో వాటా, పీఎల్ఆర్ బోనస్ చెల్లించాలని, ఇది భిక్ష కాదని, వారి హక్కు అని బీఎంఎస్ జాతీయ కార్యదర్శి పి.మాధవనాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని ఇల్లెందు గెస్ట్‌హౌజ్‌లో కాంట్రాక్ట్ కార్మికుల పిట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. హైపవర్ కమిటీ వేతనాలు వెంటనే అమలు చేయాలన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): కనీస వేతనాల సలహా మండలి సిఫారసులు అమలు చేయాలి, వేతనాల పెంపులో సుప్రీంకోర్టు తీర్పులను పరిగణలోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం కార్మిక శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం౹౹ల నుండి రాత్రి 8-00 గం౹౹ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గాంప్రసాద్ -9000327175 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148
కె. మధు - 97059 44416